# వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే



మొదటి పేజీ తరువాయి

చెల్లించాల్సిందేనని పేర్కొంది. గత ఐదేళ్లుగా వీధి జంతువుల నియంత్రణకు సంబంధించి నిబంధనలను అమలు చేయడంలో రాష్ట్రాలు పూర్తిగా విఫలమయ్యాయని కోర్టు వ్యాఖ్యానించింది.

### మేం కళ్లుమూసుకుని కూర్చోవాలా?

ఇదే సమయంలో వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారిపై కూడా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. జస్టిస్‌లు విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం ప్రభుత్వాలకే కాకుండా, వీధి కుక్కలకు ఆహారం పెట్టే డాగ్ లవర్స్, ఫీడర్స్ కూడా కుక్కల కాట్ల ఘటనలకు బాధ్యులు, జవాబుదారులుగా పరిగణిస్తామని కోర్టు స్పష్టం చేసింది. ఒకసారి కుక్కకాటు పడితే దాని ఎఫెక్ట్ బాధిత వ్యక్తిపై జీవితకాలం పాటు ఉంటుందని జస్టిస్ విక్రమ్ నాథ్ తెలిపారు. దీనిని జస్టిస్ సందీప్ మెహతా సమర్థించారు. "ఒక 9 ఏళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేస్తే బాధ్యత ఎవరిది? ఆహారం పెట్టే సంస్థలదా? ఈ సమస్యను పట్టించుకోకుండా మేము కళ్లు మూసుకోవాలా?" అని ప్రశ్నించారు.

### ప్రతీ కాటు, ప్రతీ మరణానికి భారీ జరిమానా

కుక్కలకు ఎవరు ఆహారం పెట్టినా వాటి దాడిలో ఒక చిన్నారి మరణిస్తే దానికి బాధ్యులెవరని ప్రశ్నించింది. బాలుడి ప్రాణనష్టానికి సదరు సంస్థ బాధ్యత వహించదా? అని ప్రశ్నించింది. వీధికుక్కల బెడదను నివారించేందుకు రాష్ట్రాలు తగు చర్యలు తీసుకోని నేపథ్యంలో ప్రతి కుక్కకాటుకు, కుక్కల దాడిలో జరిగే ప్రతి మరణానికి భారీ పరిహారాలు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. కుక్కలపై ప్రేమ ఉన్నవారు వాటిని తమ ఇళ్లకు తీసుకెళ్లి పెంచుకోవాలని, వీధుల్లో ఆహారం పెట్టడం సమంజసం కాదని సుప్రీంకోర్టు తెలిపింది. కుక్కలు వీధులలో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని తాము ఆమోదించబోమని వెల్లడించింది. నవంబర్ 7, 2025న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను కోర్టు విచారించింది.

అప్పట్లో విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్ల వంటి ప్రాంతాల నుంచి వీధి జంతువులను తొలగించాలని కోర్టు అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

## మున్సిపల్ ఎన్నికల "ఓటర్ల తుది జాబితాను విడుదల"




మొదటి పేజీ తరువాయి

జాబితాను అధికారికంగా వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రధాన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఓటర్ల నమోదు ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఈ జాబితాలో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య పలు చోట్ల ఎక్కువగా ఉండటం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మొత్తం 52,43,023 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 25,62,639 మంది ఉండగా, మహిళా ఓటర్లు 26,80,014 మంది, ట్రాన్స్‌జెండర్లు 640 మంది ఉన్నారు.

### అత్యధికంగా నిజామాబాద్ కార్పొరేషన్‌లో

తాజాగా, ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాల్లో అత్యధికంగా నిజామాబాద్ కార్పొరేషన్‌లో 60 వార్డులలో అత్యధికంగా 3,48, 051 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 66 వార్డులతో మొత్తం 3,40,580 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,69,679 మంది కాగా, మహిళలు 1,70,858 మంది ఉన్నారు. ఇక అత్యల్పంగా కొత్తగూడెం కార్పొరేషన్‌లో 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు.

### అత్యధికంగా సూర్యాపేట మున్సిపాలిటీలో

అత్యధిక ఓటర్లు ఉన్న మున్సిపాలిటీ జాబితా సూర్యాపేట నిలిచింది. అక్కడ 1,08,848 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 56,664 మంది మహిళలు ఉండటం విశేషం. ఇక అత్యల్పంగా అమరచింత మున్సిపాలిటీలో 9,147 ఓట్లు ఉన్నాయి. కాగా, రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను ప్రకటించింది. జనవరి 12న తుది జాబితా ప్రచురణ పూర్తయిన నేపథ్యంలో జనవరి 20న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. సీఎం ఇతర ప్రధాన పార్టీల నేతలు ఈనెల 16 నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఓటర్ల జాబితా ఆధారంగా వార్డుల వారీగా రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు. మరోవైపు ఓటర్లు తమ పేర్లను రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో సరిచూసుకోవాలని అధికారులు సూచించారు.

## ఐఏఎస్ అధికారిణిపై అనుచిత కథనాల కేసు

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేశారు. మహిళా ఐఏఎస్ ను కించపరిచేలా వార్తా కథనాలు ప్రచారం చేశారని తెలంగాణ ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీఎస్ కేసు నమోదు చేయగా సీఎం రేవంత్ రెడ్డి ఫోటోను అసభ్యకరంగా పోస్టు చేశారని కావలి వెంకటేశ్ పై కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహా ఇచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 11న కేసు నమోదు అయింది. ఈ రెండు కేసులపై దర్యాప్తు చేపట్టేందుకు హైదరాబాద్ సిటీ సీపీ వి.సి సజ్జనార్ నేతృత్వంలో 8 మంది సభ్యులతో సిట్ ను ఏర్పాటు చేశారు. సిట్ లో నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకట లక్ష్మి, సైబర్ క్రైమ్ డీసీబీ అరవింద బాబు, విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రతాప్, సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, సైబర్ సెల్ సీఐ శంకర్ రెడ్డి, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ ఎస్ఐ హరీశ్ ఉన్నారు. కాగా సీఎం రేవంత్ రెడ్డి ఫోటోలు అసభ్యకరంగా పోస్టు చేసి తెలంగాణ పబ్లిక్ టీవీ వాట్సప్ గ్రూప్ లో పోస్టు చేశారని కావలి వెంకటేశ్ పై కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహఫిర్యాదు ఇచ్చారు. ఈ ఫిర్యాదుపై ఈ నెల 11న కేసు నమోదు అయింది. ఈ నేపథ్యంలో ఈ రెండు కేసుల దర్యాప్తును వేగంగా పూర్తి చేసి, చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సిట్ ను డీజీపీ ఆదేశించారు.

## గ్రామ పంచాయతీలకు "రూ. 277 కోట్ల నిధులు"



హైదరాబాద్, జనవరి 13 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భారీ నిధులను విడుదల చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయడానికి మరియు ఇతర నిర్వహణ అవసరాల కోసం రూ. 277 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

### ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంల చొరవ

డిప్యూటీ సీఎం మరియు ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ఈ నిధులను విడుదల చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పండుగ వేళ గ్రామాల పరిపాలన సాఫీగా సాగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నిధుల విడుదల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రతినిధులకు డిప్యూటీ సీఎం సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.


### నిధుల వినియోగం ఇలా..

- తాజాగా విడుదలైన నిధులతో గ్రామాల్లో ఈ క్రింది పనులు చేపట్టడానికి వీలు కలుగుతుంది.
- పెండింగ్ బిల్లుల చెల్లింపు: గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రామ అభివృద్ధి పనుల బిల్లుల పరిష్కారం.
- పారిశుద్ధ్యం మరియు నిర్వహణ: పండుగ నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా మరియు వీధి దీపాల నిర్వహణ.
- పాలనా సౌలభ్యం: పంచాయతీ కార్యాలయాల రోజువారీ ఖర్చులకు మరియు అత్యవసర మరమ్మతులకు వినియోగం.

### స్థానిక సంస్థల హర్షం

ప్రభుత్వం పండుగ వేళ నిధులు విడుదల చేయడంపై స్థానిక సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులతో గ్రామాల్లో ఉన్న ఆర్థిక ఇబ్బందులు కొంతవరకు తొలగిపోతాయని, పండుగను సంతోషంగా జరుపుకోవడానికి ఇది దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.

## రైస్ మిల్లుల్లో విజిలెన్స్ రైడ్స్



హైదరాబాద్, జనవరి 13 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ ధాన్యం మళ్లింపును అరికట్టేందుకు తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఈ మేరకు రెండు రోజుల వ్యవధిలో చేపట్టిన తనిఖీల్లో భాగంగా సుమారు రూ.60 కోట్లకు పైగా విలువైన కస్టమ్ మిల్లింగ్ రైస్ ధాన్యం పక్కదారి పట్టినట్లుగా అధికారులు గుర్తించారు. మొత్తం విజిలెన్స్ టీమ్ 8 బృందాలుగా విడిపోయి వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, నల్లగొండ, మహబూబాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సూర్యాపేట, కామారెడ్డి, నిజామాబాద్ మొత్తం 9 జిల్లాల్లో 19 రైస్ మిల్లులను తనిఖీ చేశారు. అందులో 14 మిల్లుల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగినట్లుగా నిర్ధారించారు. అదేవిధంగా మిగిలిన 5 మిల్లులకు నోటీసులు జారీ చేసి అబ్జర్వేషన్‌లో పెట్టారు. కాగా, తనిఖీల్లో భాగంగా మొత్తం సుమారు 1.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం, 1.72 లక్షల బస్తాలు మాయమయ్యాయని, ప్రభుత్వ ఖజానాకు రూ.60 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని విజిలెన్స్ అధికారులు లెక్క తేల్చారు. ఇందులో నారాయణపేటలో రూ.15.91 కోట్లు, కామారెడ్డి–నిజామాబాద్ జిల్లాల్లో రూ.19.73 కోట్లు, సూర్యాపేటలో రూ.19.32 కోట్లు, పెద్దపల్లిలో రూ.11.38 కోట్ల విలువైన ధాన్యం తక్కువగా ఉన్నట్లుగా పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల పరిధిలోని పూసాల గ్రామంలోని జానకీరామ ఇండస్ట్రీస్ మిల్లును ఏకంగా సీజ్ చేశారు. గతంలో నేరాలకు పాల్పడిన మంథనిలోని మారుతి ఇండస్ట్రీస్‌పై క్రిమినల్ చర్యలు పూర్తి చేశారు. అక్రమాలకు పాల్పడిన మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, వారి లైసెన్సుల రద్దు చేసి బ్లాక్ లిస్టింగ్ పెడతామని, ధాన్యం రికవరీ కోసం పౌర సరఫరాల శాఖకు సిఫార్సు చేస్తామని విజిలెన్స్ అధికారులు వెల్లడించారు.




## గిగ్ వర్కర్లకు ఊరట

న్యూ ఢిల్లీ, జనవరి 13 (తీన్మార్ న్యూస్): గిగ్ వర్కర్లకు కేంద్రం ప్రభుత్వం భారీ ఉపశమనం కల్పించింది. పది నిమిషాల ఆన్‌లైన్ డెలివరీ నిర్ణయాన్ని ఎత్తివేసింది. ఈ మేరకు మంగళవారం కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ ఆదేశాలు జారీ చేశారు. గత డిసెంబర్ 25, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఈ సమ్మె జరిగింది. 10 నిమిషాల్లో డెలివరీని పూర్తిగా రద్దు చేయాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. దీంతో అప్రమత్తమైన కేంద్రం స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్ సహా అన్ని ఈ కామర్స్ సంస్థలకు కేంద్రం సూచనలు చేసింది. పది నిమిషాల నిబంధనను ఎత్తివేయాలని ఆదేశించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించింది.

## బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్



న్యూ ఢిల్లీ, జనవరి 13 (తీన్మార్ న్యూస్): బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బీహార్‌కు చెందిన నితిన్ నబీన్ ఈ నెల 20న బాధ్యతలు చేపట్టనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియను జనవరి 19న నిర్వహించనున్నారు. నబీన్ ఒక్కరే అధ్యక్ష పదవికి నామినేషన్ వేయనున్నారని బీజేపీ నేతలు చెబుతున్నారు. డిసెంబరులో పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నబీన్, ప్రస్తుతం జేపీ నడ్డా స్థానంలో జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ఈ ఎన్నికలో ఒక్కరే నామినేషన్ దాఖలు చేస్తే అదే రోజున ఫలితం ప్రకటించనున్నట్లు సమాచారం. బీజేపీ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ కె. లక్ష్మణ్ అధికారికంగా అధ్యక్షుడి పేరును ప్రకటిస్తారు.

### అతి పిన్న వయసులో పార్టీ సారథ్య బాధ్యతలు

46 ఏళ్ల వయసులో జాతీయ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న నితిన్ నబీన్, అతి పిన్న వయసులో పార్టీ సారథ్య బాధ్యతలు చేపట్టిన నేతగా రికార్డు సృష్టించనున్నారు. 1980 మే 23న జన్మించిన నబీన్, బీహార్ మంత్రి, ఐదుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈ సందర్భంగా ఢిల్లీలో జరిగే కార్యక్రమానికి బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, జాతీయ పదాధికారులు, సీనియర్ నేతలు హాజరుకానున్నారు. ప్రస్తుతం నితిన్ నబీన్ తమిళనాడు, అసోం, కేరళ, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల వ్యూహాలపై దృష్టి సారిస్తున్నారు.

## అమెరికా నుంచి కేటీఆర్‌కు ప్రతిష్టాత్మక ఆహ్వానం



తెలంగాణ బ్యూరో, జనవరి 13 (తీన్మార్ న్యూస్): మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం లభించింది. మంత్రిగా తన హయాంలో చేసిన అసాధారణ కృషి, తెలంగాణను ప్రపంచ పటంలో విశిష్టంగా నిలిపిన విధానాలను గుర్తిస్తూ, అంతర్జాతీయ వేదికపై తన ఆలోచనలను పంచుకోవాలంటూ ఆయనకు ఈ ఆహ్వానం అందింది. ఈ నేపథ్యంలో, అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఉన్న కొలంబియా బిజినెస్ స్కూల్ లో 2026 ఏప్రిల్ 4న జరగనున్న '21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ లో ప్రసంగించేందుకు కేటీఆర్‌ను ఆహ్వానించారు. ఈ సదస్సును కొలంబియా యూనివర్సిటీకి చెందిన విద్యార్థి విభాగం 'సౌత్ ఆసియా బిజినెస్ అసోసియేషన్' నిర్వహిస్తోంది. భారతదేశ వ్యాపారం, ఆవిష్కరణలు, విధాన నిర్ణయ రంగాలపై మేధోమథనం జరిగే ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక వేదికలలో ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ ఒకటిగా గుర్తింపు పొందింది. గత 21 ఏళ్లుగా న్యూయార్క్‌లో జరుగుతున్న ఈ సదస్సు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం పోషిస్తున్న పాత్రపై చర్చించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రవాస భారతీయులకు ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తోంది.

## మేడారం భక్తులకు టెక్నాలజీ తోడు

తెలంగాణ బ్యూరో, జనవరి 13 (తీన్మార్ న్యూస్): ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క–సారక్క మహా జాతర సందర్భంగా భక్తుల కోసం సౌకర్యం కోసం జాతర అప్‌డేట్స్ తెలుసుకునేందుకు 'మై మేడారం' పేరుతో స్పెషల్ వాట్సాప్ చాట్ బాట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. భక్తులు 7658912300 నంబర్‌కు వాట్సాప్‌లో మెసేజ్ చేయడం ద్వారా జాతరకు చేరుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అందుబాటులో ఉన్న మార్గాలు తెలుసుకోవచ్చు. అదేవిధంగా మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, వాహనాల రద్దీ, ట్రాఫిక్ డైవర్షన్ వివరాలు, ఇబ్బందులు తెలియజేసేందుకు కంప్లయింట్ డెస్క్, జాతర రద్దీలో ఎవరైనా తప్పిపోతే వారి వివరాలను తెలుసుకోవడం లేదా తప్పిపోయిన వారి వివరాలను నమోదు చేసే సదుపాయం 'మై మేడారం' మొబైల్ యాప్ ద్వారా కల్పించారు. ఈ సేవలు కేవలం వాట్సాప్‌లోనే కాకుండా అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా కూడా భక్తులకు అందుబాటులో ఉన్నాయని అధికారులు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవార్లను దర్శించుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

